6న ఆశీలు వసూలుపై బహిరంగ వేలం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని పొట్టి శ్రీరాములు మార్కెట్, రోడ్ మార్జిన్స్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆశీలు వసూలు ఏజెన్సీ ఎంపికకు ఈనెల ఆరో తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10 లక్షల సాల్వెన్సీ, రూ.మూడు లక్షల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. బహిరంగ వేలంలో హెచ్చు పాటదారునికి మార్కెట్, రోడ్డు మార్జిన్లలో (ఏడు విలీన గ్రామ పంచాయతీలతో సహా) ఆశీలు వసూలు చేసుకునే హక్కులు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న పాటదారులు ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో రెవిన్యూ విభాగంలో సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు సుధ

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, హెల్పర్లు
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల మద్దతు
- సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించం
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

అంగన్‌వాడీలు మునుపెన్నడూ లేని రీతిలో ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద బుధవారం చేపట్టిన బైఠాయింపు నిరసన కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ఉదయం తొమ్మిది గంటలకే కార్యకర్తలు, సహాయకులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ముందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు, సెంటర్లను వెంటనే తెరవాలని అధికారుల బెదిరింపులు మానుకోవాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అంగన్‌వాడీల బైఠాయింపుతో కలెక్టరేట్ రహదారి మూసుకుపోయింది. పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను పంపారు. తమ వెంట తెచ్చుకున్న క్యారియర్లతో అంగన్‌వాడీలు రోడ్డుపైనే భోజనం చేసి ఆందోళన కొనసాగించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కళ్యాణి, డి.సుదర్శనం మాట్లాడుతూ అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వం తన మొండివైఖరి వీడాలన్నారు. అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు మంత్రులు, అధికారులు సెంటర్లు తెరవాలని లేకుంటే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారని... ప్రభుత్వ బెదిరింపులకు వెనకడుగు వేసేది లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా సెంటర్ల తాళాలు బద్దలు కొట్టడం, నోటీసులు ఇవ్వడం, ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం, నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. ఇటువంటి పద్ధతులు మానుకోవాలని హితవు పలికారు. సమస్యలను పరిష్కరించి, సమ్మెను ఆపాల్సిన ప్రభుత్వం అదిరింపులు, బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. తెలంగాణలో 41 రోజులు, కర్నాటకలో 65 రోజులు సమ్మె చేసి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను సాధించుకున్నారని చెప్పారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు, ఇతర డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు : సిఐటియు

అంగన్వాడీలపై ప్రభుత్వం, అధికారుల బెదిరింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ అక్కాచెల్లెమ్మలపై ప్రేమ ఉందని చెప్పే ముఖ్యమంత్రి వారిని రోడ్డున పడేయడం సిగ్గుచేటు అన్నారు. అంగన్వాడీలను చర్చలకు పిలిచి ప్రధాన డిమాండ్ అయిన వేతనాలు పెంచలేమని చెప్పడం సరికాదన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే కనీసం రూ.వెయ్యి అదనంగా వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం కేవలం రూ.వెయ్యి వేతనం మాత్రమే పెంచిందని, నాలుగేళ్లుగా అంగన్వాడీల వేతనాల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకి గ్రాట్యుటీ అమలు చేయాలని తీర్పునిచ్చినా, రాష్ట్రంలో అంగన్వాడీలకి గ్రాట్యుటీ అమలు చేయడం లేదని విమర్శించారు. అంగన్వాడీలు గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని విమర్శించారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మొండివైఖరి వీడకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



రోడ్డుపైనే భోజనం చేస్తున్న అంగన్‌వాడీలు

పోరాటాన్ని ఉధృతం చేస్తాం : సిపిఎం

అంగన్‌వాడీల డిమాండ్లు న్యాయ సమ్మతమైనవని, వాటిని వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు హెచ్చరించారు. బైఠాయింపు కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వారిని మోసం చేశారని విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు పలు సంఘాల సంఘీభావం

అంగన్‌వాడీలు చేపట్టిన బైఠాయింపు కార్యక్రమానికి ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.శ్రీనివాసు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్, పి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జి.సింహాచలం, జన విజ్ఞాన వేదిక నాయకులు గొంటి గిరిధర్, ఐద్వా కార్యదర్శి పి.శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అల్లు.మహాలక్ష్మి, ఎన్.వి రమణ, ఎస్.లక్ష్మీనారాయణ, ఎ.సత్యనారాయణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, కె.సూరయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.హైమావతి, పి.లతాదేవి, జె.కాంచన, కె.సుజాత, ఆదిలక్ష్మి, శాంతామణి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నిజం గెలవాలి' యాత్ర

జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటన



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిజం గెలవాలి యాత్రలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఈనెల నాలుగో తేదీన జిల్లా పర్యటించనున్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పర్యటించి చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరామర్శిస్తారు. ఉదయం పది గంటలకు రాజాంలోని జిఎంఆర్ అతిథిగృహం నుంచి బయలుదేరి ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడాం మండలంలోని ధవళపేటలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించనున్నారు. అక్కడ్నుంచి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటలకు భోజన విరామం అనంతరం ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం తోటవాడ, ఆమదాలవలస మండలం దన్నానపేట, పాత నిమ్మతొర్లాడలో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఓదార్చుతారు. సాయంత్రం విశాఖపట్నం బయలుదేరుతారు. ఆమె రాక నేపథ్యంలో టిడిపి నాయకులు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



దొంగ హామీలతో వస్తారు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- జిల్లాలో 3,23,434 మందికి పెన్షన్ పెంపు
- రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రూరల్

రానున్న ఎన్నికల కాలంలో చంద్రబాబు అండ్ కో దొంగ హామీలతో వస్తారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. ఇచ్చిన హామీలు అధికారంలోకొచ్చాక అమలు చేయని ఘనత చంద్రబాబుకే దక్కిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో పెన్షన్ కానుక పెంపు, శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వైసిపి నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇస్తే గానీ పథకాలు అందేవి కావని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో అర్హత ఉంటే పథకాలు వాటంతట అవే ప్రజల ఇంటికి వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో 3,23,434 మందికి రూ.94.52 కోట్ల మేర పెన్షన్లు అందజేస్తున్నట్లు వివరించారు. తెల్లారేసరికి వాలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఈనెల నుంచి పెన్షన్‌ను రూ.2,750 నుంచి రూ.మూడు వేలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 9,619 పెన్షన్లు మంజూరు చేసి, వారికి ఈనెల నుంచే రూ.మూడు వేలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కళింగ వైశ్య, పొందర కార్పొరేషన్ల చైర్మన్ అంధవరపు సూరిబాబు, హైమావతి, సుడా డైరెక్టర్ కె.ఆశాలత, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, వైసిపి రూరల్ మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాలో లోపాలకు తావు లేకుండా రాజకీయ పార్టీలు అందిస్తున్న ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో 25వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో లోపాలపై గతంలో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఎక్కడా లోపాలకు తావు లేకుండాఉన్నత స్థాయిలో పరిశీలన చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తిస్థాయి ఓటర్ల తుది జాబితాను ఈనెల 22న విడుదల చేస్తామన్నారు. ఫారం 6, 7, 8కు సంబంధించిన తుది పరిశీలన పూర్తయిందని చెప్పారు. ఈనెల 12వ తేదీ నాటికి అన్నిస్థాయిల్లో క్లయిమ్‌లకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్టుగానే డబుల్ ఎంట్రీ, పోలింగ్ బూత్‌ల వారీగా బందోబస్తు తదితర అంశాలపై నివేదిక అందజేస్తామన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు గోవింద మల్లిబాబు, బిఎస్‌పి నాయకులు జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్ఓ గణపతిరావు



వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్టు అవార్డు అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్టు అవార్డు జిల్లాలోని పొందూరు కాటన్ చీరను వరించింది. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఒడిఒపి అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అవార్డును అందుకున్నారు.



పరిశ్రమల్లో మాక్ డ్రిల్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల


పరిశ్రమల్లో మాక్ డ్రిల్ తప్పనిసరిగా చేపట్టాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు స్పష్టం చేశారు. రసాయన పరిశ్రమల్లో విష వాయువుల లీకులను నియంత్రించడానికి, ప్రమాద తీవ్రతను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఆన్ సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను మండలంలోని పొన్నాడలో గల స్మార్ట్‌కమ్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ పరిశీలకులుగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు హాజరయ్యారు. ఎమెర్జెన్సీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ఆయన వివరించారు.

బెదిరింపుల పాలనకు చరమగీతం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - బూర్జ

ఇటు ప్రజలను, అటు ఉద్యోగులను బెదిరింపులకు గురిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి నియంత పాలనకు త్వరలోనే ప్రజలు చరమగీతం పాడనున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని నీలాపురం, తుడ్డలిలో పలు కార్యక్రమాల్లో బుధవారం పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనపై ప్రజలు విసిగిపోయారని తెలిపారు. లోకేష్ చేసిన యువగళం పాదయాత్రతో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట గ్రామాల్లో పర్యటిస్తున్న టిడిపి నాయకులకు ప్రజలు పడుతున్న బ్రహ్మరథమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి గురువారం జిల్లాలో పర్యటిస్తున్నారని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయనతో పాటు తుడ్డలి సర్పంచ్ అంపిలి ప్రభావతి, బూర్జ ఎంపిటిసి చొక్కార పోలినాయుడు, నాయకులు పీరుకట్ల విశ్వప్రభాకరరావు, గణపతిరావు తదితరులున్నారు.



డ్వాక్రా ఉత్పత్తులను ఆదరించండి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులను ఆదరించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యాన ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న డ్వాక్రా బజారును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలపడాలన్నారు. డ్వాక్రా బజారు పేరిట స్వయం సహాయక మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రదర్శించడంతో పాటు విక్రయించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చౌక ధరలకే పట్టణ ప్రజలకు అందించాలనే 72 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు ఎం.కృష్ణవేణి, వైసిపి నాయకులు చల్లా అలివేలుమంగ, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల విడుదలకు ఉధృత ఉద్యమం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్
- కలెక్టరేట్ వద్ద 12 గంటల ధర్నా



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సంబంధమైన బకాయిల విడుదల చేయకపోతే ఉధృత ఉద్యమం తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక సంబంధ బకాయిల విడుదల కోరుతూ కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ధర్నా రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన జీతం, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు, ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహపూరిత వాతావరణం ఉంటుందని 2019 ఎన్నికల్లో చెప్పారని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు ఇవ్వకపోగా కనీసం ఒకటో తేదీన జీతం కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు రాక బ్యాంకు ఇఎంఐలకు పెనాల్టీలు చెల్లించాల్సిన వస్తోందన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్‌లు చెల్లించకపోవడంతో అత్యవసరాల సమయంలో అనేక కష్టాలు పడాల్సి వస్తోందని చెప్పారు. దీర్ఘకాలంగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతేడాది ఆగస్టు 24న నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబర్ నాటికి అన్ని బకాయిలు చెల్లిస్తామని మంత్రివర్గ ఉపసంఘం, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా ఇంతవరకూ చెల్లించలేదని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సంబంధమైన బకాయిలను విడుదల చేయడంతో పాటు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం సంఘీభావం తెలిపారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కోశాధికారి డి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, చిట్టిబాబు, ఎం.వాగ్దేవి, ఎన్‌జిఒ నాయకులు బడగల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సిఎం జగన్మోహనరెడ్డి పాలనను కొనసాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం పట్టణంలో జూనియర్ కాలేజీలో వైఎస్ఆర్ పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పింఛను అంటేనే టెన్షన్‌గా ఉండేదన్నారు. నేడు జగన్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ఎటువంటి రాజకీయ, కుల, వర్గ, మత, అవినీతికి తావులేకుండా సంక్షేమం ఇంటి తలుపుతట్టి మరీ చేరువచేస్తున్న వైనాన్ని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పెంచిన పెన్షన్లు, రూ.25 లక్షలకు పెంచిన ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైసిపి నాయకులు బి.రమేష్ కుమార్, ఉమా మహేశ్వరరావు, డి.శ్యామలరావు, ఎం.రమేష్, ఎస్.మల్లిఖార్జునరావు, బి.వి.రమణమూర్తి, సిహెచ్ వెంకటరమణ, ఎస్.రాజు పాల్గొన్నారు.

కంచిలి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరల ఆశీర్వదించాలని స్థానిక జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ కోరారు. కంచిలి మార్కెట్ యార్డ్ వద్ద బుధవారం నిర్వహించిన వైయస్సార్ పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను 100% నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి దే అన్నారు. పెన్షన్ 3000 రూపాయల కు పెంచుతానని ఇచ్చిన హామీని దశలవారీగా నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలు, అవ్వలు, తాతలు ముఖ్యమంత్రిని మరల ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్ రెడ్డి, వజ్జ మత్యుంజయం, లడ్డు కేశవ పాత్రో, కే సురేష్, పి జయరాం, డి బలరాం, ఇప్పిలి కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు కొనియాడారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఎంపిటిసిలు పూడి నీలాచలం, సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణస్వామి, దూగాన భద్రాచలం పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థలో పింఛను కానుకను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతి, నాయకులు ఎస్.భాస్కరరావు, బి.శ్రీకృష్ణ, ఆర్.విశ్వనాథం, పి.మోహనరావు, బి.రామారావు, జి.శ్రీను, పి.కామేష్, ఎం.వెంకటరావు, టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలాకి : స్థానిక మండల పరిషత్‌లో పెంచిన పింఛను కానుకను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపిడిఒ ఉషశ్రీ, తహశీల్దార్ కె.శ్రీరాములు, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


కవిటి : పింఛను పంపిణీ చేస్తున్న విజయ, రామారావు

టెక్కలి రూరల్ : అవ్వ తాతల, వికలాంగుల, వితంతువుల సంతోషమైన జీవితం గడపడమే లక్ష్యంగా వారి జీవన ప్రమాణంలో మార్పు తీసుకువచ్చే విధంగా వైఎస్ఆర్ పింఛను కానుకను అందిస్తున్నారని టెక్కలి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రూ.3 వేలు పింఛను పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు, ఎంపిపి అట్లా సరోజనమ్మ, వైస్ ఎంపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు ఉషారాణి, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, మండల సచివాలయం కన్వీనర్లు శిగిలిపల్లి మోహనరావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని అల్లుకోలలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు పింఛన్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, సచివాలయం మండల కన్వీనర్ దువ్వాడ రవికుమార్, గుంట సత్యం మస్టారు, శ్రీనివాసరావు, కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని ఉమిలాడ గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్ఆర్ పింఛను కానుకను పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ కెల్లి లక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.బి.కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి ఉప్పాడ లోకనాతం, ఉమిలాడ వైస్ సర్పంచ్ కోడ దామోదర్, వైసిపి నాయకులు అడ్ల అప్పారావు పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ పింఛను కానుక పెంపు కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ లబ్ధిదారులకు బుధవారం పెంచిన పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం, వైసిపి నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, దన్నాన శ్రీరామ్, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, ఇఒపిఆర్‌డి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో రూ.3వేలకు పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే చేతులమీదుగా లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమ మాలినిరెడ్డి, ఎంపిపి మొదలవలస చిరంజీవి, పిఎసిఎస్ చైర్మన్ సనపల నారాయణరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మూగి శ్రీరాములు, వైసిపి నాయకులు మురళీధర్ బాబా, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, ఎంపిడిఒ రమాదేవి, ఎపిఎం రమణమూర్తి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : పింఛన్‌ను పంపిణీ చేస్తున్న జగన్నాయకులు

రైలు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతి


మురళీరావు (ఫైల్)

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ ఊసవానిపేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి నాను పాత్రుని మురళీరావు (54) మృతి చెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన మురళీధర్ వాకింగ్ చేస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి...

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం రాత్రి సమయంలో జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఈయన ఆకుపచ్చ రంగు ఫుల్ బనియన్, సిమెంట్ కలర్ ఫాంట్, నలుపు రంగు ఫుల్ డాయర్ అలాగే ఈయన వద్ద ప్లాట్‌ఫాం టిక్కెట్ ఉన్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జిఆర్‌పి ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తికి గాయాలు


బావిలో ఉన్న శంకరరావు

టెక్కలి రూరల్: స్థానిక ఆంధ్రావీధికి చెందిన ఉర్జన శంకరరావు (బుడ్డు) మంగళవారం సాయంత్రం ఆరుగుంటల సమయంలో మండలంలోని వీరరామక్క స్వాపురంలోని తోటలో చెట్టు నరికేందుకు వెళ్లాడు. అక్కడున్న నేల బావిని గమనించకపోవడంతో ప్రమాద వశాత్తు అందులో జారిపడిపోయాడు. అప్పటికే చీకటి పడడం, గ్రామస్తులెవరూ సమీపంలో లేకపోవడంతో నేలబావిలోనే ఉండిపోయాడు. కాపాడాలంటూ కేకలు వేసినా ఎవరికీ వినిపించలేదు. దీంతో మంగళవారం రాత్రి అంతా ఆ నేలబావిలో నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయం నేలబావి నుంచి కేకలు వినిపించడంతో 11 గంటల సమయంలో అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించారు. సమాచారం అందుకున్న టెక్కలి ఎస్ఐ-2 కె.రమేష్, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని అతికష్టం మీద తాళ్ల సహాయంతో వ్యక్తిని బయటకు తీశారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ఆమదాలవలస : పురపాలక సంఘం 6వవార్డు పరిధిలో టిజెఆర్ నగర్‌లో కన్న కూతురిని కిరాతకంగా కత్తితో పొడిచి చంపి భార్యను కూడా చంపాలని ప్రయత్నించి తీవ్రంగా గాయపర్చిన కేసులో ముద్దాయి కొలుసు రామారావుకు మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు జీవితకాలం జైలు శిక్ష, రూ. 2,500 జరిమానాను విధించింది. 2023 ఫిబ్రవరి 17న జరిగిన ఈ సంఘటన అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. అప్పట్లో సిఐ పి.పైడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సమయంలో సాక్షులను హాజరు పర్చి సరైన సాక్షాదారాలతో రుజువు చేయడంతో నిందితుడికి న్యాయమూర్తి పి.భాస్కరరావు శిక్షను ఖరారు చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడటంలో ఖచ్చితమైన సాక్షాధారాలతో దర్యాప్తు చేసిన పైడయ్యను జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక అభినందించారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

జాగృతి సేవలు ప్రశంసనీయం


సోంపేట: మండలంలోని కొర్లాంకు చెందిన జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే అశోక్ అన్నారు. జాగృతి సంస్థ ముద్రించిన నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాగృతి వ్యవస్థాపకులు రాంబుడ్డి గణపతి వ్యక్తిగానే కాకుండా సంస్థ పరంగా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారన్నారు. 15 ఏళ్లుగా సంస్థ ద్వారా నిరుపేద విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఆర్థికంగా సైతం చేయూత అందించారన్నారు. అలాగే వృద్ధులకు, అనాథలకు ఈ సంస్థ ఎంతగానో ఆదుకుంటుందని అన్నారు. టి.వాసుదేవరావు, పి.జోగారావు, రామ్‌బుడ్డి, జానకిరామ్, పి.ఆదినారాయణ, గణపతి పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ట్రిపుల్ ఐటి డైరెక్టర్

శ్రీకాకుళం : ఎపి శాసనసభాపతి తమ్మినేని సీతారాంను బుధవారం ఆయన స్వగృహంలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కొత్త ఏడాది అందరికీ శుభం కలగాలని స్పీకర్ సీతారాం ఆకాంక్షించారు. సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణచౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు, డీన్ వెల్ఫేర్ రవి, పిఆర్ఒ మామిడి షన్ముఖ ఉన్నారు.

యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటు

ఎచ్చెర్ల : పాఠశాలలు, కళాశాలల్లో పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు అన్నారు. బుధవారం దుప్పలవలస రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ఏ విధంగా చదవాలి, ఏం చదివితే బాగుంటుందో అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. జిల్లాలో పర్యాటక ప్రదేశాలు, వాటి చరిత్రపై విద్యార్థులకు తెలియజేశారు. అలాగే వాతావరణాన్ని సంరక్షించుటకు ప్రతిఒక్కరు మొక్కలు నాటాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ, యువజన సర్వీసుల శాఖ సిఇఒ బి.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరావు

ఆరు వారాలుగా అందని 'ఉపాధి' కూలి

స్పీకర్ వద్ద మొరపెట్టుకున్న కూలీలు


స్పీకర్ వద్ద మొర పెట్టుకుంటున్న కూలీలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఆరు వారాలుగా ఉపాధి వేతనాలు తమకు అందలేదని వెంటనే వేతనాలు అందేలా చూడాలని ఉపాధిహామీ కూలీలు స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం మండలంలో పాలవలస గ్రామ సచివాలయ పరిధిలో పాలవలస, పాలవలస కాలనీ, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు తమకు వేతనాలు అందడం లేదని, సంక్రాంతి ముందు వేతనాలు అందేటట్లు చూడాలని స్పీకర్‌ను కోరారు. వెంటనే ఎంపిడిఒ మురళీ మోహన్ కుమార్, ఉపాధిహామీ ఎపిఒ బి.పార్వతిని పిలిచి నాలుగు వారాలుగా కూలీలకు వేతనాలు అందకపోవడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఉద్యానవన శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున తక్షణమే కొత్త ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు గ్రామ సచివాలయ ఉద్యానవన శాఖ అసిస్టెంట్లుగా ఉన్న వారికి పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రతినిధులు డి.త్రినాధరావు, ఎస్.స్వాగత్ కుమార్, రేవతి, బి.సంజయ్ భార్గవ్ స్పీకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి గోవిందు శివానందమూర్తి, తహశీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చర్చల పేరుతో కాలయాపన తగదు


శ్రీకాకుళం : మానవహారం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

న్యాయసమ్మతంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లాప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం ఆరోపించారు. బుధవారం నగరంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద సంఘం ఆధ్వర్యాన మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడులూ సమ్మె 9వ రోజుకు చేరినా సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. సిఎం జగన్మోహనరెడ్డి పాదయాత్ర సమయంలో, అసెంబ్లీలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఆప్కస్ పరిధిలో ఉన్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కోరారు. 60ఏళ్లు నిండిన కార్మికులను విధులు నుంచి తొలగించిన తర్వాత పెన్షన్, గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. కార్మికులు ఏకారణంతోనైనా మరణిస్తే వారి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించి వారసులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.మోహన్, వి.రాంబాబు, బి.గణేష్, సూపర్‌వైజర్లు, డైవర్లు సురేష్ కుమార్, అప్పన్న, ఎస్.శివరాం, పి.హరి, రాజు, చిట్టి, ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకోవడంతో ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు నిరసనగా పారిశుద్ధ్య కార్మిక నాయకుడు తాడి సంతోష్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక నాయకులు కె.తారకేశ్వరరావు, జె.శ్రీను, కె.ఈశ్వరరావు, కె.వెంకటరావు, జె.వాసు, ఎన్. రాజేష్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు



ఇచ్ఛాపురం : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్‌కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

పలాస : సిఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్‌ముఖి, సీతమ్మ, గులాబి, లక్ష్మి పాల్గొన్నారు.

జగన్నాథపురం వంతెనకు శంకుస్థాపన

సంతబొమ్మాళి: మండలంలోని జగన్నాథపురంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న వంతెన పనులకు టెక్కలి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి బుధవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ జోగి రాములమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 26న కూలిపోవడంతో కలెక్టర్ శ్రీకేష్ లాటకర్‌ను కలిసి నిధులు మంజూరు చేయించామని అన్నారు. కృపారాణి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే చెల్లుతుందని అన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడానికి నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి సుగ్గు రామిరెడ్డి, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబూరావు, ఎంపిటిసి జొన్న సవరరాజు, వైస్ సర్పంచ్ కొమర రామారావు, వైసిపి నాయకులు గంట ఈశ్వరరావు, పిలక రవికుమార్, బుడ్డా మోహన్‌రెడ్డి, లండ రామారావు, పుక్కళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వాణి, కృపారాణి

ఇచ్ఛాపురం వైసిపి టిక్కెట్‌పై ఉత్కంఠ!

ఎవరికి వారు ఎత్తుకు పైఎత్తులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి టిక్కెట్ విషయంలో ఉత్కంఠ నెలకుంది. అధిష్టానం ఇంకా అధికారికంగా ప్రకటన చేయకపోయినా ఎవరి వారు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. ప్రస్తుతం వైసిపి టిక్కెట్ మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మికి వస్తుందని వాటాప్స్‌ల్లో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ మద్దతుదారులు నియోజకవర్గ వాస్త పరిస్థితులు అధిష్టానికి తెలియజెప్పేందుకు నడుము బిగించారు. అధికారికంగా రెడ్డికి సామాజిక వర్గానికి చెందిన రాజ్యలక్ష్మి పేరు ప్రకటన రాకముందే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు తెరవెనుక గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యలక్ష్మికి టిక్కెట్ ఖరాఉ చేస్తే... సాయిరాజ్ మద్దతుదారులు తామంతా పనిచేయమని ఖరాఖండీగా అధిష్టానికి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న వారికి కాదనుకుండా కొత్త పేర్లు తెరపైకి తెస్తే పార్టీ విజయావకాశాలు దెబ్బతింటాయని గట్టిగా చెప్పినట్లు తెలిసింది. సాయిరాజ్ ఎదుగుదలను చూసి ఓర్వలేని ఒకరిద్దరు ఆడుతున్న డ్రామాలని గట్టిగా ప్రచారం చేఉస్తున్నారు.

టిడిపికి కంచుకోటగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి జెండ ఎగురవేయాలంటే కష్టపడే వారికి టిక్కెట్ ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా... వచ్చే ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ పేరు హాల్‌చల్ చేస్తున్న రాజ్యలక్ష్మి భర్త మాత్రం తమకు ముఖ్యమంత్రి ఆశీస్సులు ఉన్నాయని, ఎవ్వరు ఎన్ని ప్రయత్నాలు చేసినా టిక్కెట్ తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద ఇచ్ఛాపురం టిక్కెట్‌పై ఉత్కంఠత నెలకొంది.

ఘనంగా జ్ఞానభారతి ఫౌండేషన్ డే


నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం జ్ఞాన భారతి విద్యా సంస్థల ఫౌండేషన్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల కార్యదర్శి జోహర్‌ఖాన్ అధ్వర్యాన ఫౌండేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల కార్యదర్శి జోహర్‌ఖాన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో తొలిసారిగా సిబిఎస్‌సి విద్యా విధానం ప్రవేశ పెట్టామని అన్నారు. దీనిద్వారా అనేక మంది విద్యార్థులు తమ సంస్థలో చదివి ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ జ్ఞానభారతి విద్యా సంస్థలో విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందిస్తున్నామని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి కావాల్సిన బోధనా పద్ధతులు అమలు చేయడంతో సర్వత్రా ప్రశంసలు అందుకుంటోందని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ఎఒ ప్రేమ సర్తాజ్‌ఖాన్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, రషీద్ సుల్తాన్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఆలీం ఖాన్ పాల్గొన్నారు.

ఎన్‌జిఒ స్థలం ఆక్రమణకు యత్నం!


స్థలాన్ని పరిశీలిస్తున్న గోపాల్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎపి ఎన్‌జిఒ .ఉద్యోగుల స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నాన్ని ముమ్మరం చేశారు. స్థలాన్ని భారీ యంత్రాలతో చదును చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌జిఒ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బోనెల గోపాల్ తన సంఘం నాయకులతో స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కాశీబుగ్గ సర్వే నంబరు 217/2లో 2015లో అప్పటి ప్రభుత్వం 15 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు స్థలం కేటాయించిందని అన్నారు. అప్పటి ఎంపీ కిల్లి కృపాణి మంజూరు చేసిన రూ.5 లక్షలు నిధులతో పనులు చేపట్టామని అన్నారు. అందులో కొంత స్థలంలో 108, 104 ఉద్యోగులు ఉండేందుకు గది కూడా ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల వైపు భాగంలో మరుగుదొడ్లు గదీ నిర్మించామని తెలిపారు. అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు ఉన్న ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించేందుకు యంత్రాలతో చదును చేశారని, నిర్మించిన మరుగుదొడ్లు సైతం నేలమట్టం చేశారని తెలిపారు. రూ. కోట్లు విలువ చేసే స్థలం కావడంతో ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి ఉద్యోగుల స్థలాన్ని ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయనతో పాటు కార్యదర్శి బి.ఉపేంద్రరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు ఉన్నారు.

కళింగపట్నంలో లక్ష్మీదేవి పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గం పరిధి కళింగపట్నంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి బుధవారం పర్యటించారు. గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన దుమ్ము కన్నయ్య, రాజారావు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నురు కృష్ణమూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, రాష్ట క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షులు దేవదాసు, మాజీ ఎఎంసి డైరెక్టర్ పొట్నురు వైకుంఠం, జిల్లా మత్స్యకార సంఘ సభ్యులు దుమ్ము సందరయ్య, నాయకులు దుమ్ము పొలయ్య, మైలపల్లి ఎర్రన్న పాల్గొన్నారు.


పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

'నిజం గెలవాలి'ని విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల



బూర్జ: నిజం గెలవాలి పేరుతో మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం తోటవాడకు రానున్నారని టిడిపి నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం టి.అర్.రాజుపేటలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో చాలా మంది వీరాభిమానులు హఠాన్మరణం పొందారని, ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు అప్పట్లో నిర్ణయించుకున్నారని అన్నారు. నిజం గెలవాలి పేరుతో చేపట్టిన కార్యక్రమం చంద్రబాబు బెయిల్‌తో నిలిచిపోయింది. దానిని మళ్లీ పున:ప్రారంభించిన భువనేశ్వరి బూర్జ మండలం తోటవాడకు చెందిన గేదెల సాంబమూర్తి గుండెపోటుతో మరణించగా వారి కుటుంబానికి ఓదార్చేందుకు గురువారం రానున్నారు. తోటవాడ గ్రామం నుంచి కొల్లివలస జంక్షన్ మీదగా ఆముదాలవలస మండలం దన్నాన్నపేట, నిమ్మ తొర్లాడ గ్రామం వైపు వెళ్తారని విశ్వప్రసాద్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, అభిమానులు భారీఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.



అభినందిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిటెక్ మెకానికల్ ఆకరి ఏడాది విద్యార్థులు జి.సునీల్ కుమార్, ప్రవీన్ పాత్రో, బిటెక్ ఐటిలో మూడో ఏడాది చదువుతున్న డి.వంశీ, బిటెక్ మొదటి ఏడాదిలో ఇసిఇ కోర్సు చదువుతున్న జి.బాలరాజులు దక్షిణాది రాష్ట్రాల ఇంజినీరింగ్ యూనివర్సిటీల స్థాయిలో గతనెలాఖరున చెన్నయ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. ముున్ముందు మరిన్ని పోటీల్లో పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కన్వీనర్ డాక్టర్ పి.వి.మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహనరావు, జె.తేజశ్వరి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


పొందూరు : పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

సోంపేట : మందస మండలం మూలిపాడులో బుధవారం స్థానిక ఎంపిపి డి.దానయ్య ఆధ్వర్యాన పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు డి.శ్రీకాంత్, కె.ఉమాభారతిలు మాట్లాడుతూ ఈ నెల రెండు నుంచి 31 వరకు ఉచితంగా ఈ టీకాలు వేస్తామని తెలిపారు. గ్రామాల్లో రైతులు పశువులకు ఈ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జి.వెంకటరావు, డి.కిరణ్, ధనుంజయ, భీమారావు, నాగేశ్వరరావు, నవీన్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది శ్రీను, సంతోషి, ధనుంజయ, నేతాజీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వ పశువులకు ఉచితంగా అందజేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు పశువులకు తప్పనసరిగా వేయించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కురుడు పంచాయతీ రామయ్యపేటలో సామూహిక గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం టెక్కలి ఉప సంచాలకులు డాక్టర్ వి.జయరాజు, కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డాక్టర్.ఎం.లోకనాథం చేపట్టారు.

పొందూరు : మండలం రాపాక గ్రామీణ పశువైద్య కేంద్రం పరిధిలో పశువైద్యాధికారి పి.పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఆస్పత్రి పరిధిలో రాపాకలో 150 పశువులకు ఈ టీకాలను వేసినట్లు పేర్కొన్నారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.బంగారుతల్లి, ఎహెచ్ఎ బి.స్వాతి, ఒఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆరోగ్య కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

'జగనన్న సురక్ష' ప్రజలకు రక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న సురక్షతో ప్రజల ఆరోగ్య రక్షణ కల్పిస్తుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని విధంగా ఎన్నికల హామీలు వంద శాతం వరకు అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, వార్డు కౌన్సిలర్లు సిగ్గ ప్రేమ్‌కుమార్, చాటల పుష్ప, బచ్చు జగన్, మధుమూర్తి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, మున్సిపల్ కమిషనర్ రమేష్, చాట్ల తిరుపతి, పిలక సంతోష్, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

పలాస: మండలంలోని మొగిలిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీశంకర్, డి.సత్యం పాల్గొన్నారు.


హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్

ఉప ఖజానా కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో గల ఫెన్షన్‌దారులకు (రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పదవీ విరమణ చేసిన వారికి) వార్షిక ధ్రువీకరణ పత్రాల్లో భాగంగా సర్వీసు ఫెన్షన్‌దారులు, ఫ్యామిలీ ఫెన్షన్‌దారులు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 వరకు సమర్పించాల్సి ఉండడంతో జిల్లా ఖజానా కార్యాలయంలో ఫెన్షన్ విభాగంలో హెల్ప్‌డెస్క్‌ను ఉప సంచాలకులు, సిహెచ్ రవికుమార్ బుధవారం ప్రారంభించారు. ఆదే విధంగా జిల్లాలో గల 12 ఉప ఖజానా కార్యాలయాల్లో కూడా హెల్ప్‌డెస్క్‌లను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో గల ఫెన్షన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని రవికుమార్ కోరారు. కార్యక్రమంలో సహాయ ఖజానాధికారులు ఎ.తవిటన్న, పి.గోగరాజు, ఉప ఖజాన అధికారి సిహెచ్ సమతా రాణా, సీనియర్ గణకులు ఎన్. రవి ప్రసాద్, బి.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.


ఫిష్ ఆంధ్ర డైలీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఫిష్ ఆంధ్రా ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కమ్మసిగడాంలో ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఆంధ్ర ప్రాజెక్ట్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో ఫిష్ ఆంధ్ర డైలీ యూనిట్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, రాయితీలను వినియోగించుకొని యుతవ ఉపాధి పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, సర్పంచ్ సింక రమణమ్మ, నాయకులు గొర్లె అప్పలనాయుడు, రెడ్డి వాసు, కలిశెట్టి కన్నంనాయుడు, రామకృష్ణ, ఫిషరీస్ డిడి సత్యనారాయణ, ఎడి సంతోష్ కుమార్, ఎఫ్‌డిఒ గంగాధర్, డిపిఎం షణ్ముఖరావు, సాగరమిత్రలు పాల్గొన్నారు.


బ్యాంకును ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కెవిజిడి బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సిఎసిబి బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఈ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని స్పష్టం చేశారు. బ్రాంచి మేనేజర్ ఎం.రోహిత్ వర్మ మాట్లాడుతూ ఎచ్చెర్లలో 17వ బ్రాంచిను ప్రారంభించామని, ఇప్పటివరకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం క్లస్టర్ పరిధిలో 16 బ్రాంచిలు పనిచేస్తున్నాయని, రూ.50 వేల కోట్లు టర్నోవర్, రూ.50 లక్షల మంది ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఖాతాదారులకు అనేక రుణాలు తక్కువ వడ్డీకి అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ షేక్ మహ్మద్, ప్రిన్సిపాల్ రామయ్య, భవన యజమాని సంపతిరావు గణపతిరావు పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్


స్టాలిన్‌బాబు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్‌ఇ (ఎఐఎంఎల్) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.స్టాలిన్‌బాబుకు జెఎన్‌టియు కాకినాడ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పిహెచ్ డిగ్రీ మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నరసారావుపేట ఇంజినీరింగ్ కాలేజ్‌ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎన్.తిరుమలరావు మార్గదర్శకత్వంలో జెన్‌టియు విజయగనరం ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు సహాయ మార్గదర్శకత్వంలో 'ఆటోమేటెడ్ డైగ్నోసిస్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్ ఫ్రమ్ ఎం ఆర్‌ఐ : మెటా హెయరిస్టిక్ ఎసిస్టెడ్ డీప్ లెర్నింగ్ మోడల్' అనే అంశంపై చేసిన పరిశోధన చేశారని అన్నారు. ఈ మేరకు జెన్‌టియు-కె యూనివర్సిటీ జి.స్టాలిన్‌బాబుకు ఈ పిహెచ్‌డి పట్టాను జారీ చేసిందని తెలిపారు. స్టాలిన్‌బాబుకు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెన్డీ డాక్టర్ డి.ఆజాద్, సిఎస్‌ఎం హెచ్‌వొడి డాక్టర్ ఎం.వి.బి చంద్రశేఖర్ అభినందించారు.

విజేతలకు అభినందనలు

టెక్కలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వీరికి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ, వ్యాపార సంఘం అధ్యక్షులు వారణాసి గోవిందలు ట్రోఫీని, రూ.5 వేలు నగదును బుధవారం అందజేశారు. మొదటిస్థానంలో సింహాచలం, పవన్‌ల జట్టు సాధించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు రెయ్యి రామారావు, కుప్పిలి ప్రకాష్, సింహాచలం, రెడ్డి, లాడి శ్రీనివాసరావు నర్సిపురం శేఖర్ పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యం


శ్రీకాకుళం అర్బన్ : బహుమతులు అందజేస్తున్న చక్రవర్తి

ప్రజాశక్తి- కవిటి

ఆధునిక విద్యతోనే స్త్రీకి విముక్తి లభిస్తుందని సావిత్రిబాయి పూలే భావించారని ఎంఇఒ ధనంజయ్ మజ్జి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఎంఆర్‌సి వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు వరలక్ష్మి, బి.ఉషారాణి, బి.భారతీదేవి, లక్ష్మీబాయి, బి.శ్రీమణి, బి.తేజస్వి, ఎం.గోపి, కె.రంగారావు, శ్రీరామ్మూర్తి, బిసాయి పాల్గొన్నారు.

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహన్ పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సంస్థ ప్రధాన కార్యదర్శి అర్థశాస్త్ర అధ్యాపకుడు, రౌతు గోపి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజాగాయకుడు, వైఎస్‌ఆర్ లైఫ్ టైమ్ అవార్డు గ్రహీత మజ్జి దేవిశ్రీ ఆలపించిన గేయాలు ఆలరించాయి. ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందించారు. అలాగే బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు సుధాకుమారి, పద్మ, యామిని, మెహర్ సుధా, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, లక్ష్మీబాయిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రామారావు, లూక్‌పాల్, ఝాన్సీరాణి, సి.కవిత, సిహెచ్.దుర్గ సావిత్రిబాయి పూలే సమతా సైనిక్ దళ ఆధ్వర్యాన స్థానిక మహిళా వసతిగృహ ఆవరణలో జిల్లా కన్వీనర్ చల్లా రామారావు, మాధవరావు, గోపి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, కురమాన దాలయ్యలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సత్తారు వేణీకుమారిని సన్మానించారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాంతినికేతన్ హైస్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులను నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంటరాక్ట్ క్లబ్ కో-ఆర్డినేటర్ కేసిపూరి, ప్రెసిడెంట్ లక్ష్మీనరసింహరెడ్డి, సెక్రటరీ తేజస్. ఎస్‌పిఎల్ మాధవి, ఉపాధ్యాయులు సురేఖ, శాంతి పాత్ర, రాజ్యలక్ష్మి, శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్రలో హెచ్ఎం పి.రామకృష్ణ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, డి.నాగమణి, బి.నాగమణి, బి.రజని, జి.జగదాంబ, త్రివేణిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఎస్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, టి.లోకేశ్వరరావు, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, ఉమాదేవి, విజయలక్ష్మి, నాగమణి, రజని, జగదాంబ, శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే 193వ జయంతి వేడుకలు నగరంలో శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా వ్యవస్థ ద్వారా ఎన్నో సామాజిక మార్పులకు శ్రీకారం చుట్టిన సావిత్రిబాయి పూలే విగ్రహానికి గాంధీ మందిర కమిటీ సభ్యులు పుష్పాంజలి ఘటించారు. కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ మహిళలను విద్యవైపు మలిచి సామాజిక వికాసానికి సావిత్రిబాయిపూలే ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.


పొందూరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: మండలం తమ్మినాయుడుపేటలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వావిలపల్లి రామకృష్ణ, రాకోటి రాంబాబు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరిచుకుని సావిత్రిబాయ్ పూలే జయంతి నిర్వహించారు. సిస్టమ్ జూనియర్, డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిత్తిరి రాజు, సిస్టమ్ కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, ఛైర్మెన్ మొదలవలస సాయికృష్ణ, ప్రిన్సిపాల్ బోర రమణ పాల్గొన్నారు. మండలంలో మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. గూనానపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి మధుబాబు ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

ఆసరా నిధులతో అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం అందిస్తున్న వైఎస్‌ఆర్ ఆసరా నిధులతో మహిళలు అభివృద్ధి చెందాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలో పట్టణ సమాఖ్య కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల తేదీ నాటికి రాష్ట్రంలో మహిళా సంఘాలకు ఉన్న బ్యాంకు అప్పు మొత్తాన్ని రుణమాఫీ చేస్తూ, మహిళా సంఘాలకు ఆసరా పేరుతో ఇప్పటికే మూడు వాయిదాల సొమ్మును బ్యాంకు ఖాతాలకు జమ చేయడమైందన్నారు. జనవరి నెలలో 4వ విడత మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయబోతున్నట్లు సిఎం ప్రకటించడంతో మండలంలో స్వయంశక్తి సంఘాలన్నింటికీ ఆసరా మొత్తాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కుటుంబ అభివృద్ధితో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సంఘసభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, ఉపాధ్యక్షులు ఉషారాణి, కోశాధికారి రేణుక, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తమ సమస్యల పరిష్కారం కోరుతూ 15 రోజులుగా నిరవదిక సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు బుధవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. నగరంలో జ్యోతిరావుపూలే పార్క్ వద్ద మేకాళ్లపై అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. ఈ శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించారు. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గొంటి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఉద్యోగులందరూ సమ్మెబాట పట్టడానికి ప్రభుత్వమే కారణమన్నారు. ఉద్యోగుల పట్ల సిఎం అనుసరిస్తున్న దోరణి సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలు చెల్లించి పని భారాన్ని పెంచిన ప్రభుత్వం, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బి.చిట్టిబాబు, సమగ్రశిక్ష ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ, జెఎసి ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, సూర్యనారాయణ, ప్రకాష్, మోహనరావు, రమేష్, జయరామ్, పైల వేణుగోపాల్, జనార్ధనరావు, రాజేష్, అమ్మినాయుడు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిల్చొని అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

స్పెషల్ ఫీజులను తగ్గించాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో పెంచిన స్పెషల్ ఫీజులను తగ్గించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యుయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ పి.బాలను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ కాలేజీల్లో విద్య ఒఎస్ యాప్ ద్వారా విద్యార్థుల ఫీజులు కళాశాలలో కట్టించుకున్నారని అన్నారు. సకాలంలో కట్టను విద్యార్థులకు అదనపు ఫీజు కట్టాల్సి వస్తోందని, వెంటనే ఒఎస్ పే యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ డెవలప్‌మెంట్, స్పెషల్ ఫీజులను పెంచిన వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పేద విద్యార్థులు చదువుకు దూరఅవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇఒ నంబరు 77 ద్వారా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో విజయ్, జీవన్, మధు, భగవాన్, సునీల్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్

సైబర్ మోసాలపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న వెంకటేష్


ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. బుధవారం మండలంలో రామచంద్రాపురం గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులతో డబ్బులు విత్‌డ్రా చేయించరాదన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సిసి ఉమాలక్ష్మి, సిఎఫ్ ప్రశాంతి, సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

జనసేన నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

పలాసలో జనసేన నూతన కార్యాలయాన్ని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిప్పాన దుర్యోధనరెడ్డి, పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 టిడిపి, జనసేన విజయ దుందిభిమోగించడం ఖాయమన్నారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యను పవన్ కళ్యాణ్ ద్వారా ప్రపంచానికి తెలియజేశారని అన్నారు. జనసేన పార్టీలో ఉన్న యువత దేశంలో ఏ రాజకీయ పార్టీలోనూ లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బైపల్లి ఈశ్వరరావు, దాసరి రాజు, పేడాడ రామ్మోహనరావు, ఎన్ని రాజు, నిమ్మక నిబ్రమ్, బలగ ప్రవీణ్ కుమార్, మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, దిలీప్ కుమార్ పాణిగ్రాహి, దిలీప్ కుమార్ పాత్రో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గారావు

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి


నౌపడ : వడ్డితాండ్రలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పద్మావతి

నౌపడ: మహిళలు ఆర్థిక స్వావలంబనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన పెట్టుబడులు, సాంకేతిక సహాయాన్ని అందించి కృషి చేస్తున్నాయని జిల్లా సెర్ప్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. సంతబొమ్మాళి మండలం వడ్డీతాండ్ర, దండు గోపాలపురం గ్రామాల్లో బుధవారం ఆమె సందర్శించారు. పెరటి కోళ్లు, సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జాతీయ గ్రామీణ ఉపాధిలో మిషన్ కార్యక్రమాల ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం వివిధ రకాల యూనిట్లు సందర్శించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సెర్ఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్, శ్రీనివాస్, జిల్లా లైవ్‌స్టాక్ డిపిఎం డాక్టర్ సన్యాసిరావు, టెక్కలి ఏరియా కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీరాములు, నరసన్నపేట ఏరియా కో-ఆర్డినేటర్ కొండలురావు, సంతబొమ్మాళి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో ఐకెపి ద్వారా పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ యూనిట్లను జీవనోపాధి విభాగం డైరెక్టర్ పద్మావతి, శ్రీనివాస్, సుధాకర్ పరిశీలించారు. మండలంలో పోలవరంలో నాటుకోళ్ల పెంపకం, టెక్కలిలో పిండిమిల్లు పరిశీలించారు. వాటిపై వచ్చిన ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. చిరు వ్యాపారాల ద్వారా ఆదాయాన్ని పెంచుకొని దిశా కృషి చేయాలని ఎపిఎం జి.నారాయణరావు సూచించారు.ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, సిసి వరదరాజులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా నెహ్రూ పార్కు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు సంక్రాంతి కానుకగా నెహ్రు పార్కు (ముత్యాలమ్మ కోనేరు)ను సుందరంగా తీర్చిదిద్ది అందిస్తామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. ముత్యాలమ్మ కోనేరులో చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్యాలమ్మ కోనే అభివృద్ధి పనులు రూ.పది లక్షలతో రెండు నెలల క్రితం పనులు ప్రారంభించామని అన్నారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా పనులు చేపడుతున్నారని అన్నారు. మరో రూ.పది లక్షలు పనులకు టెండర్ పిలిచామని, వాటిలో పార్కులో బెంచీలు, లైటింగ్. ఓపెన్ జిమ్, చిన్నపిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు పనులు మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ గిరిబాబు అన్నారు. కాశీబుగ్గలో పెండింగ్‌లోని తారు రోడ్డు పనులను కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రోడ్డుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు పక్కకు మార్చామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో తారు రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్, మున్సిపల్ డిఇ సునీల్ కుమార్, ఎఇ అవినాష్ ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

క్రికెట్ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల: మండలంలో శ్రీ శివాని కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన జెఎన్‌టియువి క్రికెట్ ఎంపికల్లో తుది జట్టును మంగళవారం ప్రకటించారు. జట్టులో ఎస్‌డి. కులశేఖర్, వై.జ్ఞాన తేజ, ఐ.జాన్ పాల్, ఎం.సాయి యస్వంత్, వై.యజ్ఞ పవన్ కుమార్, సిహెచ్ జయంత్, కె యస్వంత్, బి.అభయ్ నాయుడు, సిహెచ్ వరుణ్ తేజ్ రెడ్డి, ఎస్.తేజ, జె.జస్వంత్, డి.చైతన్య, టి.మోహన్ రిషి సాహిత్, వి.సాయి నాగ దినేష్, సిహెచ్ జయంత్, వి.సునీల్ వున్నారు. వీరంతా ఈ నెల 7 నుంచి 16 వరకు చెన్నైలో జరగనున్న సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డిఆర్‌వై శ్రీనివాసరావు, ఆర్గనైజేషన్ కార్యదర్శి టి.బాలాజీ తెలిపారు.

కొండపోరంబోకు స్థలాన్ని కాపాడాలి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చిట్టివలస గ్రామ రెవెన్యూ పరిధిలోని కొండపోరంబోకు స్థలం ఆక్రమణఖు గురవుతుందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి స్థలాన్ని కాపాడాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పాల పోలారావు, చిట్టి సింహాచలంలు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రాజకుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన వండాన రాజేశ్వరమ్మ ఎదురుగా ఉన్న స్థలాన్ని కొనుగోళ్లు చేసి 79 సెంట్ల కొండపోరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తున్నారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి స్థలం దురాక్రమణ కాకుండా చూడాలని కోరారు.

పాఠశాలల సందర్శన

కంచిలి:మండలంలోని ఎమ్మెస్ పల్లి మోడల్ స్కూల్, స్థానిక ప్రాథమిక పాఠశాల, జాడుపూడి కస్తూరిబా పాఠశాలలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి జి.లక్ష్మీనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి పాఠశాలల్లోనూ లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం అమలు, పిల్లల ప్రగతి ఇతర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పర్లాకిమిడి: క్రీడలతోనే మానసికోల్లాసం వస్తుందని వారణాసి ప్రభుత్వ హైస్కూల్ పీడీ అంధవరపు మధుసూదనరావు అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలోని వారణాసి ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో 'నువా ఒడిశా - నోబీనో ఒడిశా' పిలుపు మేరకు క్రీడా, యువజన విభాగం ఆధ్వర్యాన ఆటాపాటా పోటీలను బుధవారం నిర్వహించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి వజ్రపుకొత్తూరు

కేంద్ర, రాష్ట్ర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని నువ్వలరేవు సచివాలయంలో సర్పంచ్ ఎజ్రా అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమకు రక్షణ రక్షణ కల్పించే చట్టాలపైన, హక్కులపైన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకోవాలన్నారు. నిర్భయ, దిశ, గృహహింస చట్టాలపై అవగాహన అవసరమని సూచించారు. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మువ్వల దేవ, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సరుబుజ్జిలి మండల సమావేశం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4న గురువారం నిర్వహించినట్లు ఎంపిడిఒ పి.వి.మురళీమోహన్ కుమార్ తెలిపారు. ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించబడునని తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరితో పాటు అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

ఇన్‌ఛార్జి కార్యదర్శుల నియామకం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో తాడివలస, పెనుబర్తి పంచాయతీలకు పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఇన్‌ఛార్జి కార్యదర్శిలను నియమించినట్లు బుధవారం ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. తాడివలస పంచాయతీకి బి.శ్రీనివాసరావు, పెనుబర్తి పంచాయతీకి బి.వెంకటరావును నియమించినట్లు ఉత్తర్వులను జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు సంత వేలం పాట

కోటబొమ్మాళి : ఈ నెల 5న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నారాయణవలస గురువారం సంతవేలం పాట నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సంప్రదించాలని ఆయన సూచించారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

మెళియాపుట్టి : మండలంలోని పెద్దమడి కాలనీలో ఇళ్లు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించాలని డిఎల్‌డిఒ సంఘం అధ్యక్షులు సవర కుమార్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ పి.సరోజనమ్మను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కంఠం సర్వే నంబరుకు సంబంధించిన 7/2లో సర్వే చేపట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. అలాగే అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గిరిజనులు ఉన్నారు.